క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


గంజాల మౌనిక


నిమ్మల యశస్విని


సాధనాల లిఖితదుర్గ

కాళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ట్రిపుల్ ఐటి క్యాంపస్ లో చోటు సాధించటం శుభపరిణామమని ఎంఈఓ ఏ.రవీంద్ర బుధవారం తెలిపారు. కాళ్ల మండలం నుంచి ముగ్గురు విద్యార్థినీలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ కు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. కాళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివిన గంజాల మౌనిక ఒంగోలు క్యాంపస్‌కు, నిమ్మల యశస్విని నూజివీడు క్యాంపస్‌కు, కోపల్లె హైస్కూల్ నుంచి సాధనాల లిఖితదుర్గ నూజివీడు క్యాంపస్‌కు ఎంపికైనట్లు ఆయన స్పష్టం చేశారు. వీరు ముగ్గురు సాఫ్ట్వేర్ ఇంజనీర్ కావాలన్నదే వారి లక్ష్యమని తెలిపారన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవికి విశేష పూజలు


మల్లెపూల అలంకరణలో అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని భీమవరం మెంటేవారితోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి 25 కేజీల మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో పట్టణానికి చెందిన మద్దాల వెంకట సతీష్ దంపతులు, కోత్తూరి వెంకటేశ్వర్రావు, శివరంజని దంపతులచే కుంకుమ పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మద్దాల సత్యనారాయణ దంపతులచే 25 కేజీల మల్లెపూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీరు నిలిస్తే దారి గల్లంతే


ఉండి రిజిస్ట్రార్ ఆఫీస్ ముందు బురదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఉండి: ప్రతిరోజు పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు కానీ కార్యాలయంలోకి వెళ్లాలంటే సర్కస్ ఫీట్ చేయాల్సిందే అన్నట్టుంది ఉండి రిజిస్ట్రార్ కార్యాలయ ముఖ ద్వారం.కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఉండి రిజిస్ట్రేషన్ కార్యాలయ ముఖ ద్వారా బురదమయంగా మారింది. జాతీయ రహదారి నుంచి కార్యాలయంలోనికి రావాలంటే బురదలో కాలు వేయాల్సిందే అన్నట్టుగా మారింది. దీనివల్ల రిజిస్ట్రేషన్‌లు, ఇతర పనుల కొరకు వచ్చే ప్రజలు కార్యాలయంలోనికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు కాలుజారిపోతుందేమో అనే భయంతో అడుగులు వేసి ముందుకెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉండితో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు రిజిస్ట్రేషన్‌ల కొరకు ఉండికి వస్తుంటారు కనుక అధికారులు కార్యాలయ ముఖ ద్వారంలో బేబీచిప్స్ వంటివి వేస్తే కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు తెలుపుతున్నారు.

డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


సిద్ధాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఉప సభాపతి కె.రఘు రామకృష్ణంరాజు భూమి పూజ చేశారు. రూ. 34 లక్షల వ్యయంతో గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మాణం, శివారు గ్రామమైన నందమిల్లి పాడు, కాళింగగూడెంలలో రూ. 10 లక్షతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంపీపీ కతారి జయలక్ష్మి, సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు, మోటుపల్లి ప్రసాద్, భూపతిరాజు తిమ్మరాజు, గవర లక్ష్మి, ఎంపీడీఓ సుహాసిని, పంచాతీరాజ్ ఏఈ రమణమ్మ, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం నుంచి మావుళ్లమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం రాత్రి మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, మావుళ్లమ్మ ఆలయ పునఃనిర్మాణ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో జాతరను బుధవారం ఉదయం వరకూ నిర్వహించారు.

ఖరీఫ్‌కు అన్నదాతలు సమాయత్తం

విత్తన శుద్ధిపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయాధికారులు


మండలంలోని యనమదుర్రు గ్రామంలో నారుమడులు వేసిన దృశ్యం


దిరుసుమర్రులో పొలంలో దుక్కులు దున్నుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే పలకరించడంతో ఖరీఫ్ వరి సాగుకు అన్నదాతలు సమయాత్తమవుతున్నారు. అడపాదడపా కురుస్తున్న తొలకరి జల్లులు తొలకరి పంట సాగుకు అనుకూలతను చూపుతున్నాయి. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరి పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్‌ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ ఇబ్బందులు ఎదురు కాకుండా సకాలంలో సాగును చేపట్టాలని వ్యవసాయాధికారులు చేస్తున్న సూచనల నేపథ్యంలో వాతావరణం కూడా అనుకూలించడం రైతాంగాన్ని మరింత ఉత్తేజపరుస్తోంది. భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, తుందుర్రు, అనాకోడేరు, కొమరాడ, రాయలం, చినఅమిరం, నరసింహపురం తదితర గ్రామాలలో ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. పంటకాలువలు ద్వారా సాగు నీరు ఈ నెల 1 నుంచి విడుదల చేయడం, తొలకరి జల్లులు పడటంతో రైతులు నారుమడులను సిద్ధం చేసి విత్తనాలను చల్లుతున్నారు. మరికొన్ని చోట్ల పొలాల్లో ట్రాక్టర్లతో దమ్ములు చేయడం, గట్టులంకలు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

నారుమడి తయారీ

నారుమడి తయారు చేసుకోవడానికి వినియోగించే భూమిలో చివరి దుక్కులో ఐదు సెంట్ల భూమికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, కిలో పోటాషియమ్ చల్లాలి. ఆకుమడిలో ముంపు నీరు దిగేందుకు చిన్న చిన్న నాలి, ఆకుమడి చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో విత్తనాలు చల్లుకున్న తర్వాత మొదటి ఆకు విచ్చుకునే వరకు 10 రోజుల పాటు ఆరుతడి యాజమాన్యం నిర్వహించాలి. 11 వ రోజు తర్వాత మొదటి ఆకు విచ్చుకున్నాక నారుమడిలో నీరు ఉండేటట్లు చూసుకోవాలి. ఇలా నారుమడి వేసిన 21–25 రోజుల్లో నాణ్యమైన నారు తయారవుతుంది.

విత్తన శుద్ధితో నాణ్యమైన నారు

విత్తనం కొన్న వెంటనే 100 గింజలను మొలక పరీక్ష చేసి 80 శాతం మొలక వచ్చిన విత్తనాలనే వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే విత్తన శుద్ధితో నాణ్యమైన నారు లభిస్తుంది. పొడి శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కార్బన్‌డిజం మందు విత్తనాల సంచిలో వేసి మూతి బిగించి బాగా కలిపి 24 గంటలు నిల్వ ఉంచాలి. ఆ తర్వాత వాటిని నానెట్టి నారుమడిలో చల్లుకోవాలి. తడి విత్తన శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు ఒక గ్రాము కార్బన్‌డిజం, ఒక లీటర్ నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టి మరో 24 గంటలు మండి కట్టి వాటిని నారుమడిలో చల్లుకోవాలి. ఒక ఎకరాకు చాలినంత నారు కావాలంటే 20 నుంచి 30 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయి.

ముందస్తు సార్వా సాగు చేపట్టాలి



ముందస్తు సార్వా సాగు చేపట్టడం వల్ల సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వచ్చే వరదలు, తుఫాన్‌ల నుంచి పంటను రక్షించుకోవచ్చు. అంతేకాకుండా తదానంతరం దాళ్వా సాగుపై ఈ ప్రభావం ఉండకపోవచ్చు. ప్రస్తుతం కాలువలు ద్వారా సాగు నీరు వస్తుంది. అడపాదడపా తొలకరి జల్లులు పడుతున్నాయి. సాగులో నారుమడి యాజమాన్య విధానం, విత్తన శుద్ధితో నాణ్యమైన నారుతోనే అధిక దిగుబడి వస్తుంది.

–వైవీఎస్ ప్రసాద్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ఎస్ వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మండల సర్వేలను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు పెండింగ్, జాయింట్ ఎల్ పి ఎం ఎస్ సంబంధించిన పురోగతిపై బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి, డివిజన్ మండల సర్వేలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా శ్రద్ధ పెట్టి పనిచేయాలని సర్వే అధికారులును ఆదేశించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి అర్జీదారుడుతో మాట్లాడి అర్జీల పై మళ్లీ పునఃసమీక్ష చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే ఇన్చార్జ్ అధికారి కె.శ్రీనివాసరావు, డివిజన్ సర్వే అధికారులు జి.మల్లికార్జునరావు, కె.నాగభూషణం, కె.కరుణ కుమార్, మండల సర్వేలు, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం


నరసింహస్వామిని పరామర్శిస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన పెనుమాల నరసింహస్వామి ఇటీవల అనారోగ్యానికి గురై భీమవరంలోని ఉషోదయ హాస్పటల్స్‌లో చికిత్స పొందడంతో ఆయనను బుధవారం భీమవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు పరామర్శించారు. నరసింహస్వామి అనారోగ్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మేమంతా అండగా ఉన్నామని అధైర్య పడవద్దని నరసింహస్వామికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని తుల సీరావు, రేవు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆకివీడు: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో అక్రమ మద్యం (ఎన్డిపిఎల్)విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు. స్థానికంగా నివసిస్తున్న సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద 13 అక్రమ మద్యం బాటిల్ (750ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ చక్రవర్తి, ఎస్సై కరుణ ప్రియా ప్రియా సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్ల జాతర మహోత్సవాలు


గరగనృత్యాలు

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు స్వామి వార్ల ఆషాడ మాస జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల గరగలను పూరిగుడిసి నుంచి ప్రత్యేక పూజలు చేసి మేళ, తాళాలతో, బాణాసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉయ్యాల స్తంభాల వద్ద భారీ ఎత్తున జాతర కార్యక్రమం నిర్వహించటం జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామచంద్రరావు, ఏలూరి సూర్యనారాయణ, బుట్టయ్య, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!




ఉండి శివారు పులిగుమ్మ, కోలమూరు శివారు అరుంధతీపేటలను కలిపే వంతెన శిథిలావస్థకు చేరిన దృశ్యం

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండి శివారులోని పులిగుమ్మ, కోలమూరు గ్రామ శివారు అరుంధతీ పేటలను కలిపేందుకు యండగండి మీడియం డ్రెయిన్‌పై నిర్మాణం చేసిన వంతెన శిథిలావస్థకు చేరడంతో స్థానిక ప్రజలు, రైతులు, వాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు. ఈ వంతెనను 1981లో నిర్మాణం చేశారు. ఆనాటి నుంచి ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సేవలందించిన ఈ వంతెనకు ప్రస్తుతం ప్రమాదం వాటిల్లబోతుంది. వంతెనకు ఒకవైపు ఉండి శివారు ప్రాంతంమైన పులిగుమ్మ ఉంది. మరో ప్రాంతంలో రాష్ట్రీయ రహదారిని అనుకుని కోలమూరు శివారు అరుంధతీపేట, పాములపర్రు గ్రామాలు ఉన్నాయి. ఈ వంతెన ఆధారంగానే ఉండి శివారు, చిలుకూరు, పాములపర్రు, కోలమూరు గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల రైతులు తమ ఆక్వాచెరువుల వద్దకు వెళ్లడం, పట్టుబడి చేసేందుకు భారీ వాహనాలు వెళ్లడం జరుగుతుంది. అలాగే పులిగుమ్మలో ఓ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. వీటికి వెళ్లాలన్నా ఈ వంతెనపై నుంచే వెళ్లాలి. అయితే ఇప్పుడు ఈ వంతెన ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, స్థానికులు, విద్యార్థులు ప్రతి రోజు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు వంతెన దాటే సమయంలో మరింత ప్రమాదకరంగా, ఆందోళనగా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. వంతెనకు ఒక ప్రక్కగా రెయిలింగ్ పూర్తిగా దెబ్బతిని కాలువలోకి వేలాడుతుండగా మరోపక్క పాక్షికంగా దెబ్బతింది.అంతేకాకుండా రెయిలింగ్‌ను ఆనుకుని కట్టిన గోడలు కూడా పూర్తిగా కూలిపోయి డ్రెయిన్‌లో పడిపోయాయి.పైకి కనిపిస్తున్నట్లు కాకుండా వంతెనపై ప్రయాణం మరింత భయానకంగా ఉంటుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వంతెనపై నుంచి కిందకి దిగే సమయంలో యూ టర్న్ తీసుకోవల్సి రావడంతో భారీ వాహనాలు, ట్రాక్టర్‌లు ప్రమాదం అంచుల్లోనే వెళుతున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వెంటనే స్పందించి వంతెన పునఃనిర్మాణం చేపట్టే లోపుగా తాత్కాలిక పనుల్లో భాగంగా రెయిలింగ్ నిర్మాణం చేపట్టి విద్యార్థులను, వాహనదారులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

5న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నరసాపురం: వచ్చే నెల 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణపై బుధవారం కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు ఇరుపక్షాలకు నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా వారిలో అవగాహన పెంచొచ్చని చెప్పారు. రాజీ చేసుకోదగ్గ కేసులు పరిష్కరించుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు.

విత్తన ఎంపికకు నేల స్వభావం కీలకం


అయిభీమరం గ్రామంలో పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

ఆకివీడు: వరి సాగులో నేల స్వభావాన్ని బట్టి విత్తన ఎంపిక జరగాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కేఏఎస్ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని అయిభీమవరం, కోళ్లపర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భూములు చౌడు, నల్లరేగడి, ఇసుక భూములుగా ఉన్నాయన్నారు.చౌడు ప్రాంతాల్లో ఎంసీఎం-100, ఎంటీయూ 1262, 1061, 1064 రకాల్ని సాగు చేసుకోవలని సూచించారు. ముంపుప్రాంతాల్లో ఎంటీయూ 1232 రకం ఎంపిక చేసుకోవాలన్నారు. సాధారణ నేలల్లో ఎంటీయూ 1318, 1121, వంటి రకాల్ని సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.మధుమోహన్, ఏఈఓ సంతోష్, మాజీ సర్పంచ్ కనుమూరు రామ కృష్ణంరాజు, మాజీ వైస్ ఎంపీపీ నౌకట్ల రామారావు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో తూడు తొలగింపు


ఎన్నార్పీ అగ్రహారంలో డ్రెయిన్‌లో చెత్త తొలగిస్తున్న రైతులు

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో రైతులు రక్కీసకోడు మురుగుబోదెలో స్వచ్ఛందంగా చెత్తా చెదారాన్ని తొలగించారు. వర్షాకాలం కావడంతో తమ పంటలు ముంపుకు గురవుతాయని దానిని గ్రహించి డ్రెయిన్ పరిధిలోని రైతులు కొంత ధనాన్ని సమకూర్చుకుని చెత్తా చెదారం, తూడు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు రైతు భూపతిరాజు హరనాథరాజు తెలిపారు. మురుగునీరు పారేందుకు ఎటువంటి ఆటంకాలు కల్పించకుండా ప్రజలు సహకరించాలని ఎవ్వరూ డ్రెయిన్‌లో చెత్తా చెదారం వంటివి వేయవద్దని రైతులు తెలిపారు. డ్రెయిన్ ప్రక్షాళనకు రైతులు ప్రతి ఏటా కొంత మొత్తం ఖర్చుచేయాల్సి ఉంటుంది గనుక ప్రజలు సహకరించాలని వారు కోరారు. అధికారులు డ్రెయిన్ ప్రక్షాళన చేసేవరకు ఎదురు చూస్తే పంటలు ముంపుకు గురవుతాయని అందుకే రైతులే స్వచ్ఛందంగా ప్రక్షాళన చేపట్టినట్లు హరనాథరాజు తెలిపారు.

శివరామప్రసాద్‌కు సన్మానం


శివరామప్రసాద్ సన్మాన సభలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: జిల్లాకు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా టి శివరామ ప్రసాద్ చౌక ధర దుకాణాల వద్ద నిత్యవసర సరుకులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విధ నిర్వహణతో అవార్డులు పొందారని జిల్లా జాయింట్ కలెక్టర్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రశంసించారు. కృష్ణాజిల్లాకు బదిలీ అయిన శివరామప్రసాద్ సన్మాన సభను బుధవారం పౌరసరఫరాల సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక ధాన్యం దిగుమతి జిల్లా అయినప్పటికీ ఎటువంటి అవంతరాలు లేకుండా విజయవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నందు కూడా జిల్లాను ఎప్పుడూ రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాలలోనే నిలబెట్టేవారన్నారు. జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్‌లు, మండల వ్యవసాయ అధికారులు, పౌరసరఫరాల సిబ్బంది, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 25 హక్కులు కోల్పోయిన రోజు

పాలకొల్లు సెంట్రల్: భారతదేశం చరిత్రలో జూన్ 25 అంటే దేశం హక్కులను కోల్పోయిన రోజని రాజ్య సభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక లజపతిరాయ్‌పేట మాంటిస్సోరి స్కూల్‌లో కాంగ్రెస్ విధించిన అత్యవసర పరిస్థితి చీకటి రోజుకు 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


ఉపాధ్యాయుడు సుబ్బరాజును సత్కరిస్తున్న ఎంఈఓ రవీంద్ర తదితరులు

వీరవాసరం: బదిలీ అనేది ఉపాధ్యాయ వృత్తిలో సాధారణమే అయినా ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు బదిలీ కావడం పాఠశాలకు లోటుగానే ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరవాసరం నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు అడబాల పద్మజారాణి, కొత్తమాసు లక్ష్మిపార్వతి, పంపన సాయిబాబు, డా. చిలుకూరి ఫణికుమార్, యర్రంశెట్టి వేంకటేశ్వరరావు, అంబటి రామలక్ష్మి, ఆదిరెడ్డి శివ కుమార్, మారంపల్లి పుష్పలత, ఎం పెద్దిరాజులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో బాధ్యతతో విధులు నిర్వర్తించి విద్యార్థుల ప్రగతికి కృషి చేసిన ఉపాధ్యాయులు సర్వదా అభినందనీయులు అని నూతనంగా వెళ్లిన పాఠశాలలో కూడా విధినిర్వహణలో కృషిచేసి మంచిపేరు సంపాదించుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రథమ సహాయకులు శనివారపు ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ అడ్డాల కృష్ణ, రత్నారాజు, మన్నె వేంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది బదిలీ అయిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలకు బదిలీపై నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు కుడా స్వాగత సత్కారం అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా అందరి మన్ననలు పొందడం అభినందనీయం

కాళ్ల: ఉపాధ్యాయుడుగా పనిచేసిన గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల అభిమానం పొందడం ఉపాధ్యాయులకు గొప్ప గౌరవం అని మండల విద్యాశాఖ అధికారి ఏ. రవీంద్ర అన్నారు. మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలి నందు ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహించి పీఎస్ హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన అడ్డాల వెంకట సుబ్బరాజుకు సత్కార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికై విశేష కృషి చేసి మనబడి నాడు నేడులో బడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సుబ్బరాజు సేవలను గ్రామస్తులు కొనియాడారు.ఈ సందర్భంగా సుబ్బరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి ధనలక్ష్మి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శ్రీ కట్రెడ్డి శ్రీనివాసరావు, నూకల భోగేంద్రబాబు,ఎస్ఎంసి చైర్మన్ టి. అశోక్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ రవికుమార్, ఉపాధ్యాయులు బిఆర్ఎంకే స్వామి ఎం విజయలక్ష్మి, ఏ విజయలక్ష్మి, ,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి


సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న వాసుదేవరావు

భీమవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. స్థానిక వెంటే వారి తోట సుందరయ్య భవనంలో జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల్లో సీపీఎం పార్టీ టౌన్ కార్యదర్శి బి వాసుదేవరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మొండి చెయ్యి చూపారని ఆయన అన్నారు. ప్రభుత్వాలు పాలకులు మారుతున్నారు కానీ పేదవాడి సొంత ఇంటి కల నెరవేరటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కరెంట్ చార్జీలు, నిత్యవసర వస్తు ధరలు, గ్యాస్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలో రాగానే ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేసిందని ఆయన అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న కాలంలో ప్రజలను సమీకరించి ఆ సమస్యలు పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం వైకుంఠరావు, జి రామకృష్ణ, ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు


రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్ భారతి విజయలక్ష్మి

పాలకోడేరు: పౌర సరఫరాల కమిషనర్ వారి ఆదేశానుసారం గురువారం ఉదయం నుంచి ఈనెల 30వ తేదీ వరకు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు అందజేయాలని తహసీల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి మండలంలోని రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. వద్ధులకు, వికలాంగులకు, బెడ్ మీద ఉండే రోగులకు వారి ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందించే ప్రక్రియ అత్యంత పా రదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై డీటీ ఆదిశేషయ్య , మాణిక్యాలరావు, రేషన్ డీలర్లు అసోసియేషన్ మండల అధ్యక్షుడు దొంగ కృష్ణ, కార్యదర్శి సోము రామకృష్ణ, ఎం వీవీ సత్యనారాయణ, సాంబ్రాణి పద్మజ, ఎస్ఎన్ వి కృష్ణవేణి, కె.వి నాగలక్ష్మి, సుజాత, ఉషారాణి, బైరెడ్డి వెంకటేశ్వరరావు, కే నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.